క్లుప్తంగా

ఘంటసాలకు ఘన నివాళి

చీమకుర్తి: అభయ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చీమకుర్తిలో సినీ గాయకుడు దివంగత ఘంటసాల వెంకటేశ్వరరావుకు ఘనంగా నివాళులర్పించారు. అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఆధ్వర్యంలో చీమకుర్తిలోని మెయిన్‌రోడ్డులో ఉన్న ఘంటసాల విగ్రహానికి స్థానిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సినీరంగంలో ఘంటసాల పాడిన మధుర గీతాలు, చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష పార్టీలను అస్థిరపరచడమే బీజేపీ అజెండా



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

చీమకుర్తి: దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచిన ప్రతిపక్ష పార్టీలను అస్థిరపరచడమే బీజేపీ అజెండా అని సీపీఎం జిల్లా, చీమకుర్తి మండల నాయకులు ఎస్‌కే మాబు, పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, త్రిపుర అసెంబ్లీ ఎన్నికలను ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం చీమకుర్తి బస్టాండ్ నుంచి సీపీఎం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బీజేపీ అప్రజాస్వామిక పాలనకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కాలం సుబ్బారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అధునాతన గుండె చికిత్స విజయవంతం



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

ఒంగోలు అర్బన్: నిమిషానికి 40 సార్లు మాత్రమే గుండె కొట్టుకుంటున్న కొరిశపాడు మండలం రావినూతల గ్రామానికి చెందిన ఆంజనేయులుకు ఒంగోలు కిమ్స్‌లో తొలిసారిగా నిర్వహించిన అధునాతన గుండె విద్యుత్ ప్రేరక శస్త్ర చికిత్స విజయవంతమైనట్లు కిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరినాయుడు తెలిపారు. శుక్రవారం కిమ్స్‌లో శస్త్ర చికిత్స చేసిన వైద్యుడు డాక్టర్ ఆనంద్ యాదవ్, ఆపరేషన్‌లో పాల్గొన్న వైద్యులతో కలిసి శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గుండె ప్రసరణ వ్యవస్థలో లోపం ఉన్న వారికి గుండె కుడి జఠరిక శిఖర భాగంలో శాశ్వత కృత్రిమ హృదయ గతి ప్రేరక యంత్రం అమరుస్తారని తెలిపారు. దీని వలన 15 శాతం మంది రోగుల్లో భవిష్యత్తులో సాధారణ గుండె పంపింగ్ పనితనం తగ్గవచ్చన్నారు. ఇప్పుడు చేసిన అధునాతన గుండె విద్యుత్ ప్రేరక శస్త్ర చికిత్సతో గుండె విద్యుత్ ప్రసరణ వ్యవస్థలోనే ప్రేరక యంత్రం అమర్చామన్నారు. తద్వారా గుండె పనితనం కూడా తగ్గదని తెలిపారు.

ప్రతి ఎకరాకు ఎరువులు ఆర్డర్ పెట్టండి

కొత్తపట్నం: రైతు భరోసా కేంద్రాల పరిధిలోని ప్రతి ఎకరాకు ఎరువులు ఆర్డర్ పెట్టాలని మండల అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ చంద్రశేఖరరెడ్డి అధికారులను ఆదేశించారు. కొత్తపట్నం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం మండల అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో అన్ని రకాల పంటలు నమోదు చేయాలని, ఈకేవైసీ సరైన సమయానికి చేయాలని సూచించారు. రైతులకు కావాల్సిన ఎరువులు డీఏపీ, యూరియా, అమోనియం, సూపర్‌ఫాస్ఫేట్ ఎక్కువ మోతాదులో ఆర్డర్ పెట్టాలని చెప్పారు. ప్రతి రైతుకు ఎరువులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఏవో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌కు కావాల్సిన ఎరువులను ఇప్పటికే ఆర్డర్ పెట్టామన్నారు. కొన్ని ఎరువులు వచ్చాయన్నారు. మిగిలిన రైతులకు కూడా త్వరలో వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.సుజాత, హార్టికల్చర్ ఆఫీసర్ తేజ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఆశ, వీఏఏఎస్, వీహెచ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

గుడ్లూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పూరేటిపల్లి, దప్పళంపాడు గ్రామాల్లోని మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న కందుకూరు సెబ్ సీఐ వెంకటేశ్వర్లు ఆదేశాలు మేరకు ఎస్సై మౌలాలి సిబ్బందితో కలిసి దాడులు చేసి రెండు గ్రామాల్లోని రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం చేసుకొని డ్రైవర్లను అదుపులోనికి తీసుకున్నారు. రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మౌలాలి తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

'జియో' ప్రతినిధులపై కమిషనర్ ఆగ్రహం

- నిబంధనలకు విరుద్ధంగా నగరంలో గుంతలు తవ్వి పూడ్చకుంటే ఊరుకోమని హెచ్చరిక
- పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎంఈకి ఆదేశం
- జియో–5జీ కోసం ఒంగోలులో తవ్విన గుంతలను పరిశీలించిన కమిషనర్ వెంకటేశ్వరరావు...

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో ఇష్టం వచ్చినట్లు గుంతలు తవ్వి పూడ్చకుండా వదిలేసి ప్రజలను ఇబ్బంది పెడుతున్న సెల్ సిగ్నలింగ్ కంపెనీ జియో ప్రతినిధులపై నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని 36వ డివిజన్ పరిధిలో గల అయ్యప్పస్వామి గుడి, నిర్మల్‌నగర్ ప్రాంతాల్లో శుక్రవారం కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు జియో కంపెనీ పైపులైన్లు వేయడానికి ఎక్కడ పడితే అక్కడ గుంతలు తవ్వి పూడ్చకుండా వదిలేశారని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో వెంటనే జియో కంపెనీ ప్రతినిధులను అక్కడకు పిలిపించారు. కేబుల్ పనులు పూర్తయిన తర్వాత గుంతలు ఎందుకు పూడ్చలేదని కమిషనర్ ప్రశ్నించారు. జియో–5జీ నిమిత్తం కేబుల్ పనుల కోసం గుంతలు తవ్వి పూర్తయిన వెంటనే పూడ్చాలని ఆదేశించారు. జియో–5జీ నిమిత్తం ఒంగోలు నగరపాలక సంస్థ అనుమతించిన మేరకు, అదే విధంగా ప్రభుత్వం ఇచ్చిన వర్క్ ఆర్డర్ ప్రకారం పనులు చేపట్టాలన్నారు. వర్క్ ఆర్డర్ ప్రకారం రెండు గుంతలు తీసిన తర్వాత అక్కడ పని పూర్తి చేసి ఆ తర్వాతే మూడో గుంత తవ్వాలని స్పష్టం చేశారు. ఆ విధంగా కాకుండా ఇష్టం వచ్చినట్లు గుంతలు తవ్వి ప్రజలకు అసౌకర్యం కల్పిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో సీసీ రోడ్లు ధ్వంసం చేశారని మండిపడ్డారు. సీసీ రోడ్లు ధ్వంసం చేయడంతో పాటు తీసిన గుంతలకు సేఫ్టీ చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. తీసిన గుంతల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ గుంతల వల్ల ప్రధానంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సేఫ్టీ చర్యలు తీసుకోకపోవడంతో పాటు సీసీ రోడ్లు ధ్వంసం చేసినందుకు జియో ప్రతినిధులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఇంజినీర్ కే మాల్యాద్రిని ఆదేశించారు. తీసిన గుంతల వల్ల, వాటి చుట్టూ జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ప్రజలు, విద్యార్థులు వాటిల్లో పడ్డారని తెలిపారు. వెంటనే పనులు పూర్తి చేసి సీసీ రోడ్లను యథా స్థితికి తీసుకురావాలని జియో ప్రతినిధులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఎంఈ కే మాల్యాద్రి, డీఈఈ గణపతి, ఏఈ చంద్రశేఖర్, 36వ డివిజన్ కార్పొరేటర్ దాకా సుజాత హనుమారెడ్డి ఉన్నారు.



నగరంలో తవ్విన గుంతలు పూడ్చాలని జియో కంపెనీ ప్రతినిధులకు సూచిస్తున్న కమిషనర్

ఉచిత ఓపీతో పాటు వైద్య పరీక్షలు

- బెతూన్ నర్సింగ్ హోం నిర్వాహకులు ఉదయిని, పురుషోత్తమ్

ఒంగోలు అర్బన్: స్థానిక మంగమూరు రోడ్డులోని బెతూన్ నర్సింగ్ హోంలో కొంతకాలం పాటు ఉచిత ఓపీతో పాటు వైద్య పరీక్షలు కూడా ఉచితంగా అందజేయనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు, డాక్టర్లు ఉదయిని, పురుషోత్తమరావు తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా ఆదర్శభావాలతో ఉన్నత లక్ష్యాలతో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం మూడో తరం వైద్యులుగా, రంగారావు వారసులుగా డాక్టర్ స్వాతి, సందీప్ ఆధునిక వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ఆస్పత్రిని ఆధునికీకరించి అత్యాధునిక యంత్రాలు, ఆపరేషన్ థియేటర్లు, వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ల్యాబ్‌లు, లాప్రోస్కోపిక్ యంత్రాలు అత్యాధునికంగా ఏర్పాటు చేశామని చెప్పారు. ఉచిత ఓపీతో పాటు ఎక్స్‌రే, ఇతర పరీక్షలు కూడా ప్రజలకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. పలురకాల విభాగాలతో మల్టీ స్పెషాలిటీ సేవలు అందిస్తున్నామని, సంతాన సాఫల్య విభాగం, ఆర్థో, గైనకాలజీ, యూరాలజీ, తదితర వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. ఉచిత వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్ సందీప్ ప్రకాష్, ల్యాప్రోస్కోపిక్ డాక్టర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బెతూన్ నర్సింగ్ హోమ్ వైద్యులు

సౌత్ జోన్ మెగా టీ20 క్రికెట్ పోటీలు ప్రారంభం



మ్యాచ్‌లో తలపడుతున్న హెఎంసీసీ-మణి లెవన్స్ జట్లు

ఒంగోలు: సౌత్ జోన్ మెగా టీ20 క్రికెట్ పోటీలను స్థానిక శర్మా కాలేజీ క్రికెట్ గ్రౌండులో ఒంగోలు ఏఎంసీ మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం శుక్రవారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని ఆయన మాట్లాడుతూ చిరు అభిమానులు క్రమశిక్షణతో పాటు సేవా కార్యక్రమాలకు కూడా పెట్టింది పేరన్నారు. 8 రోజులపాటు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా 8 రోజులపాటు రక్తదాన శిబిరం కూడా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం జరిగిన పోటీల్లో తొలి మ్యాచ్ హెఎంసీసీ-మణిలెవన్స్ జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన హెచ్ఎంసీసీ జట్టు 144 పరుగులకు ఆలౌట్ కాగా, మణి లెవన్స్ జట్టు మరో ఐదు బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని కైవసం చేసుకుంది. మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆర్ఎఫ్‌సీసీ జట్టు 18 ఓవర్లకు 154 పరుగులు చేయగా, అనంతరం ఎఫ్‌సీసీ జట్టు 5 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసి అపజయం పాలైంది. దీంతో ఆర్ఎఫ్‌సీసీ జట్టు 11 పరుగులతో విజయాన్ని కైవసం చేసుకుంది. కార్యక్రమంలో రిజిస్టర్ ఆఫీస్ సూపరింటెండెంట్ నరసింహారావు, ఆర్గనైజర్లు ఇందుర్తి దుంబు, రావూరి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివినప్పుడే విజయం

ఒంగోలు టౌన్: క్రమశిక్షణతో చదివినప్పుడే విద్యార్థులు విజయం సాధిస్తారని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొప్పోలు హనుమంతరావు అన్నారు. శుక్రవారం స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఆధ్వర్యంలో వంద మంది 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హనుమంతరావు మాట్లాడుతూ సమిష్టి కృషితోనే ఏ వ్యవస్థ అయినా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. విద్యార్థులు కుటుంబం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. స్టడీ మెటీరియల్ కిట్ల దాతలు ఐనాబత్తుని సూర్యప్రకాశ్, టీవీఎస్ ప్రసాద్, దండు రామాంజనేయులు, మామిడి సరేష్, చలువాది శ్రీహరి, గంటా ఆంజనేయులు, సుబ్బయ్యశర్మలకు కృతజ్ఞతలు తెలిపారు.



కొప్పోలు మాస్టర్‌ను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కార్యక్రమంలో క్లబ్ సభ్యులు నైనాల రామకృష్ణ, రాధిక, ఏడుకొండలు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొప్పోలు హనుమంతరావును ఘనంగా సత్కరించారు.

అర్ధరాత్రి ఘర్షణకు దిగిన ఇరువర్గాలు

ఒంగోలు టౌన్: స్థానిక అద్దంకి బస్టాండు సెంటరులో గురువారం అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒక్కసారిగా ఇరువర్గాలు దాడికి దిగాయి. దీంతో ఉద్రిక్తత నెలకొంది. కాసేపు అక్కడ ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కాలేదు. అరుపులు, కేకలతో అద్దంకి బస్టాండ్ సెంటర్ దద్దరిల్లింది. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ రాఘవరావు సిబ్బందితో వచ్చి ఘర్షణకు దిగిన యువకులపై లాఠీ ఝులిపించడంతో వెళ్లిపోయారు. అయితే, శుక్రవారం ఇరువర్గాలు ఒకరి మీద మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. రాత్రి డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళుతుండగా బాపూజీ మార్కెట్ వద్దకు ఎదురైన వంజా యశోద కృష్ణ అనే యువకుడు తనపట్ల అనుచితంగా ప్రవర్తించినట్లు అద్దంకి బస్టాండు సెంటరులోని ఒక హోటల్‌లో సప్లయర్‌గా పనిచేస్తున్న ఒరిస్సాకు చెందిన లక్ష్మీలోహర్ అనే యువతి ఫిర్యాదు చేసింది. బైకు మీద వెళుతుండగా ఆయిల్ అయిపోయిందని, బాపూజీ కాంప్లెక్స్ సమీపంలో బండిని పక్కకు పెడుతున్న క్రమంలో బండి తగలడంతో లక్ష్మి, ఆమె సహచరులు తనపై దాడి చేశారని కబాడీపాలేనికి చెందిన యశోద కృష్ణ ఫిర్యాదు చేశారు. ఇద్దరి ఫిర్యాదులు నమోదు చేసుకున్న టూటౌన్ ఎస్ఐ ఊసా సాంబశివరావు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ-క్రాప్ పూర్తి చేయండి

- వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సోమశేఖర్

ఒంగోలు రూరల్: రైతులు సాగుచేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలని వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ సోమశేఖర్ ఆ శాఖ మండల అధికారులు, సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశానికి సోమశేఖర్ అధ్యక్షత వహించారు. ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, కరవది సొసైటీ చైర్మన్ వాకా కృష్ణారెడ్డి, ఒంగోలు వ్యవసాయ అధికారి కిషోర్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ రైతులందరూ ఈ-క్రాప్ నమోదుకు సహకరించాలని కోరారు. ఈ ఏడాది అధికంగా ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించి ఆదుకోవడంతో కోలుకోవడం జరిగిందన్నారు. ఎంపీపీ పల్లపోలు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు, సేకరణ ఈ నెల 20 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ధాన్యంలో తేమ శాతం తక్కువగా ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కరవది సొసైటీ చైర్మన్ వాకా కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం సేకరించిన విధంగానే తేమ శాతాన్ని గుర్తించి ధాన్యం సేకరణ జరుగుతుందని, ధాన్యం అధికంగా పండే ప్రాంతంలో ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో చేజర్ల సర్పంచ్ చాగంటి రవికుమార్‌రెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సోమశేఖర్

పథకాలన్నింటినీ ప్రజల వద్దకు తీసుకెళ్లండి

- ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

ఒంగోలు రూరల్: ప్రభుత్వ పథకాలన్నింటినీ మండలంలోని ప్రజల వద్దకు తీసుకెళ్లాల్సిన బాధ్యత సచివాలయ కార్యదర్శులు, సిబ్బందిపై ఉందని ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం మండలంలోని గుండాయపాలెం గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులు నిర్మిస్తున్న గృహాలను పరిశీలించారు. అనంతరం దేవరంపాడు హరిజనవాడ, దేవరంపాడు, పాతపాడు, బొద్దులూరివారిపాలెం సచివాలయం, ఉలిచి సచివాలయాల్లో కార్యదర్శులు ఆశీర్వాదం, సురేష్‌బాబు, సుజాత, శ్రీలత, భారతి, శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావుతో మాట్లాడారు. సుడిగాలి పర్యటన చేసి అన్ని గ్రామ సచివాలయాలను సందర్శించారు. ప్రధానంగా బయోమెట్రిక్ హాజరుపై అవగాహన కల్పించారు. అతిక్రమించిన ఉద్యోగులపై తప్పనిసరిగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటి వరకు ఎన్ని సచివాలయాల పరిధిలో సచివాలయ భవనాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు నిర్మించారనే విషయంపై సంపూర్ణ నివేదికలు రూపొందించి సోమవారంలోగా అందజేయాలని స్పష్టం చేశారు. జగనన్న కాలనీల్లో ఇప్పటి వరకు గృహాలు ప్రారంభించిన వారి నివేదిక, పూర్తిచేసిన వారి నివేదిక, ప్రారంభించని వారి సమాచారాన్ని తక్షణమే సేకరించి అందజేయాలన్నారు. సచివాలయాల్లో ఈ-సర్వీస్‌లు 25 తప్పనిసరిగా చేయాలని, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు సంయుక్తంగా ఎన్‌డీసీ సర్వేను వేగంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆయుష్మాన్‌భవను పూర్తి చేయాలని, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో శిక్షణ పూర్తిస్థాయిలో పొందాలని కార్యదర్శులను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి అమలు చేస్తున్న పథకాలు అర్హులకు చేరేలా చూడాలన్నారు. అనర్హులకు పథకాలు చేరిన పక్షంలో ఆయా శాఖల సిబ్బందిపై తగు చర్యలు తీసుకునేందుకు వెనకాడేది లేదన్నారు. అనంతరం ఆయా గ్రామ సచివాలయాల్లో సిబ్బందితో ఆయా విభాగాల పనితీరు, పురోగతిపై పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. తొలుత గుండాయపాలెంలో ఫ్రై డే డ్రై డే నిర్వహించిన అనంతరం మండల యూపీ పాఠశాలను సందర్శించి హెచ్ఎంను అభినందించారు. ఆయన వెంట ఆయా గ్రామాల కార్యదర్శులతో పాటు హౌసింగ్ ఏఈ, విద్యుత్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్.వాణి పాల్గొన్నారు.



గుండాయపాలెంలో నిర్మిస్తున్న గృహాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఇతర అధికారులు

ఘనంగా అమ్మవారి ప్రాకారోత్సవం



అమ్మవారి ప్రాకారోత్సవం దృశ్యం

ఒంగోలు టౌన్: నగరంలోని కేశవస్వామిపేటలో గల శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి వైభవంగా ప్రాకారోత్సవం నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణాధికారి డి.రజనీకుమారి, ధర్మకర్తల మండలి సభ్యుడు కుర్రా ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో కూడా పన్నులు కట్టొచ్చు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో పన్ను బకాయిల చెల్లింపుదారులు సెలవు రోజుల్లో కూడా పన్నులు కట్టొచ్చని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. శని, ఆదివారాల్లో కూడా ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, మంచినీటి కొళాయి పన్ను కట్టించుకోనున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేస్తున్న డాక్టర్ శాంతకుమారి

ఒంగోలు అర్బన్: విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండి ఆరోగ్యాలను సంరక్షించుకోవాలని ప్రముఖ స్త్రీల వ్యాధులు, హైరిస్క్ ప్రెగెన్సీ స్పెషలిస్ట్ డాక్టర్ చాపల శాంతకుమారి సూచించారు. స్థానిక సరస్వతి డిగ్రీ కాలేజీ విద్యార్థినులకు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో వ్యక్తిగత పరిశుభ్రతపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతకుమారి మాట్లాడుతూ మహిళల్లో రక్తం శాతం, ఎముకల పటిష్టత, హార్మోన్ల బ్యాలెన్స్ చక్కగా ఉండాలన్నారు. సమతుల పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినుల వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థినులు మౌనిక, ప్రియాంక, శ్రావణిలకు ప్రతిభా పురస్కార జ్ఞాపికలను డాక్టర్ చాపల వంశీకృష్ణ, శాంతకుమారి అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ఆర్గనైజర్ రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలోనే సుఖ ప్రసవాలు



కొత్తపట్నం పీహెచ్‌సీలో గర్భిణులకు భోజనాలు పెడుతున్న డాక్టర్ వైష్ణవి

కొత్తపట్నం: గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే సుఖప్రసవాలు చేస్తున్నామని డాక్టర్ వైష్ణవి తెలిపారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ మాధవీలత ఆదేశాల మేరకు గర్భిణులకు వైద్య పరీక్షల్లో భాగంగా గురు, శుక్రవారాలు రెండు రోజుల పాటు స్థానిక పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు బీపీ, షుగర్, వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని, మూడో నెల నుంచి హాస్పిటల్లో అన్ని పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్తం తక్కువగా ఉన్నవారిని గుర్తించి ఐరన్ ఇంజెక్షన్లు ఇవ్వడం, పిండం బరువు తక్కువగా ఉన్నవారిని గుర్తించి మందులు, పోషక పదార్థాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. గర్భిణులపై ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్పొరేట్ హాస్పిటల్ కంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మిన్నగా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

చెత్త లేని గ్రామంగా తీర్చిదిద్దాలి

అల్లూరు (కొత్తపట్నం): ప్రతి పంచాయతీని చెత్త లేని గ్రామంగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో పి.సుజాత క్లాప్ మిత్రలను ఆదేశించారు. కాఫీ విత్ క్లాప్ మిత్రల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం క్లాప్ మిత్రలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తడి, పొడి చెత్త అనేది ఇంటి నుంచి ప్రారంభం కావాలని, తడి, పొడి చెత్త తీసుకొచ్చే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఫ్రై డే, డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. గృహ యజమానుల దగ్గరకు వెళ్లి ఫ్రై డే డ్రై డే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారి అర్చన, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమాదేవి, హిమబిందు, పంచాయతీ కార్యదర్శి ఐపీ రామారావు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



క్లాప్‌మిత్రలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సుజాత

వినికిడి యంత్రం అందజేత

టంగుటూరు: సింగరాయకొండ మండలం పాకల గ్రామానికి చెందిన బత్తుల శివారెడ్డికి వినికిడి యంత్రాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జేసీఎస్ మండల కన్వీనర్ చింతపల్లి హరిబాబు అందజేశారు. ఆయన సమస్యను స్థానిక నాయకులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు దృష్టికి తీసుకురాగా జిల్లా అధికారులతో మాట్లాడి వినికిడి యంత్రం మంజూరు చేయించారు. కార్యక్రమంలో బీసీడి ఉదయకుమార్, ఏఎంసీ డైరెక్టర్ టంగుటూరి రామకృష్ణ, మన్నం వెంకయ్య, నన్నూరి వెంకటేశ్వర్లు, కొమ్ము బుజ్జి, రవి, పాకల శ్రీను, ఏసు తదితరులు పాల్గొన్నారు.



వినికిడి యంత్రం అందజేస్తున్న జేసీఎస్ మండల కన్వీనర్ చింతపల్లి హరిబాబు

5జీ ధరల ప్రతిపాదనలపై ఎంపీ మాగుంట ప్రశ్న

ఒంగోలు టౌన్: దేశంలో వినియోగదారులకు అందించే 5జీ సేవల ధరల నిర్ణయం, ప్రజలను ప్రోత్సహించేందుకు ధరల తగ్గింపు ప్రతిపాదనల గురించి ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో శుక్రవారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రశ్నించారు. 5జీ సేవలు ప్రవేశపెట్టడానికి దశలవారీగా ప్రణాళికలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి మాగుంట అడిగిన ప్రశ్నలకు కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి దేవుసిన్హ సౌమన్ సమాధానమిచ్చారు. ప్రస్తుత చార్జీల ప్రకారం జాతీయ రోమింగ్, మొబైల్ పోర్టబిలిటీ, అద్దె సర్క్యూట్ మినహా కమ్యూనికేషన్ సేవలు ఎన్నో కష్టాల్లో ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. వినియోగదారులను ప్రోత్సహించేందుకు రీచార్జి విలువలను సేవా ప్రొవైడర్లు నిర్ణయిస్తారన్నారు. దేశంలో అన్ని ప్రాంతాల్లో 5జీ సేవలను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఒక ప్రణాళికను సిద్ధం చేసిందని తెలిపారు.